




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 205 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 31 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :205 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 31 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్

- మిగతా2లో





## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో



## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది



- సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందన్న పేర్ని నాని
- బోరు వేయాలన్నా రూ. 50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బాధితుల పక్షాన పోరాడతామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని

- మిగతా2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

- తిరుమలలో కాస్త తగ్గిన భక్తుల తాకిడి
- శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- 10 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 80,774 మంది
- రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

- మిగతా2లో



## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన చంద్రబాబు
- కూటమి ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్న సీఎం
- గత 20 నెలల పాలనే మన ఐక్యతకు నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ఐక్యతా స్ఫూర్తి పదికాలాలు కొనసాగాలని ఆకాంక్ష



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి,

- మిగతా2లో



## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

### సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్

- తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల భూమిని రూ. 94 కోట్లకే అప్పగించారన్న భూమన
- బహిరంగ ప్రకటన కూడా లేకుండానే భూమిని దోచిపెట్టారని మండిపాటు
- వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి,

- మిగతా2లో

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ... ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...
- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం
- నాయుడుపేటలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లలోకి ప్రవేశించిన సీఎం చంద్రబాబు
- హిందూ లబ్ధిదారు ఇంటిలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ముస్లిం కుటుంబంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చంద్రబాబు
- కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు







పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు. ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు.ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం

- మిగతా2లో

## ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- పోలీసుల ముందు లొంగిపోయిన మావో నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న
- ఏవోబీ ప్రాంతంలో దశాబ్దాల పాటు ఆయనది కీలక పాత్ర
- మావోయిస్టుల లొంగుబాటుకు రేపటితో ముగుస్తున్న డెడ్ లైన్

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మావోయిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న వేళ, మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న చెల్లూరు నారాయణరావు

- మిగతా2లో



## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న

- మిగతా2లో



## హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హర్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు

- మిగతా2లో



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది.

కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల దిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు; మన సంస్కృతిని, భాషను కూడా అణగదొక్కాలని చూస్తోంది. 'హిందీ-హిందూ-హిందుస్థాన్' అనే నినాదంతో దక్షిణాదిలోని విభిన్న భాషా అస్తిత్వాలను తుడిచివేయాలని చూస్తున్నారు. కేరళలో లౌకికవాదాన్ని, తమిళనాడులో ద్రవిడ ఆత్మగౌరవాన్ని, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాస్వామిక సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన చిచ్చు పెడుతున్నారు. దక్షిణాదిలోని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు నేటికీ సెక్యులర్ విలువలకి కంచుకోటలు. అందుకే ఈ రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన నిధుల అంశం, స్టాలిన్ వినిపిస్తున్న భాషా హక్కుల గళం, పినరయి విజయన్ సాగిస్తున్న ఫెడరలిజం పోరాటం.. ఇవన్నీ ఇప్పుడు ఒకే వేదికపైకి రావాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దక్షిణాది ముఖ్యమంత్రులందరూ ఒకే గొంతుతో ఢిల్లీని నిలదీయాలి. ఇది కేవలం పాలకుల పోరాటం కాకూడదు. దక్షిణాదిలోని ప్రతి పౌరుడికి ఈ అన్యాయం గురించి తెలియాలి. మా నిధులు మాకే – మా హక్కులు మాకే అనే నినాదం మార్మోగాలి. కార్పొరేట్ శక్తులకు దేశ వనరులను కట్టబెడుతూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి దక్షిణాది నుంచే అసలైన ప్రతిఘటన మొదలవ్వాలి. లెఫ్ట్, డెమోక్రటిక్, సెక్యులర్ శక్తులు ప్రజలను ఆర్గనైజ్ చేసి, ఒక భారీ 'సౌత్ ఇండియా ర్యాలీ' ద్వారా తమ సత్తా చాటాలి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి దేశానికి గర్వకారణం కావాలి కానీ, అది మన బలహీనత కాకూడదు. దిల్లీ పీఠం దక్షిణాదిని శాసించడం కాదు, దక్షిణాది ప్రజాస్వామిక గళం దిల్లీని నియంత్రించే రోజు రావాలి. అది మన ఆత్మగౌరవ పోరాటం!

# ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- మొదటి పేజి తరువాయి

అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామం ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిని దాదాపు లేకుండా చేసినట్లయ్యిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నారాయణరావు ప్రస్థానం పీపుల్స్ వార్ కాలం నుంచే ప్రారంభమైంది. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక హోదాల్లో పనిచేశారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో, రిక్రూట్‌మెంట్లు చేపట్టడంలో ఆయనది కీలక పాత్ర. అటవీ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు గెరిల్లా పోరాటంలో ఆరితేరిన సోమన్న లొంగుబాటును ఏపీ డీజీపీ త్వరలోనే అధికారికంగా ధ్రువీకరించనున్నారు.గత ఏడాది కాలంగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టుల కోటలను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, 2026 మార్చి 31 (రేపు) నాటికి దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం దిశగా బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ గడువు ముగియడానికి కేవలం కొన్ని గంటల ముందే అత్యంత కీలక నేత సోమన్న లొంగిపోవడం గమనార్హం.

# రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్డ్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది:

# కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) – కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# హార్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హార్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హార్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

ఇరాన్ నాయకులు ఖండించారు.

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హార్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..

# రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' (ఆూఎూఆ=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.

ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- మొదటి పేజి తరువాయి

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారథి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు

# చూడవు, రికార్డు చేయవు

- మొదటి పేజి తరువాయి

భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

# కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది

- మొదటి పేజి తరువాయి

మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు. పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు. 83 సెంట్ల భూమి ఉన్న రైతును ఆర్డీవో సాంబశివరావు నానా హైరానా పెట్టి, చెరువును పూడ్చాలని ఆదేశించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ముడుపుల మాయలో పడి చిన్న రైతుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన పోరాడతామని పేర్ని నాని హెచ్చరించారు.

## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

- మొదటి పేజి తరువాయి

పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు.

ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

## జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతిని సత్కరించిన ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ గా పదోన్నతిపై వెళుతున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిషాంతిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అభినందనలు తెలిపారు. అనంతరం శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్గా బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించి ప్రజలుకు సేవలు అందించి మంచి ఆధికారిణిగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి , మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయ వెంకటలక్ష్మి , అయితాబత్తుల రత్నాకరన్ తదిత్ఉలు పాల్గొన్నారు.







## 44 టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల

## మీదుగా జీవితకాల సఫల్య బహుమతి అందుకున్న బొల్లంరెడ్డి రామకృష్ణ





**గండేపల్లి,పెన్ పవర్, మార్చి 30:** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విజయవాడ మంగళగిరి ఆఫీసులో, తెలుగుదేశం పార్టీ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయిలో 19 మంది ఎంపిక చేయడం జరిగింది. అందులో మన టిడిపి యాప్ ను సమర్థవంతంగా ఉన్నత స్థాయిలో ప్రమోట్ చేసినందుకు గాను కాకినాడ జిల్లా, జగ్గంపేట నియోజకవర్గం, గండేపల్లి మండలం గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణకు చాలా అరుదైన పురస్కారం లభించింది. జీవిత సాఫల్య బహుమతి గా అంటే లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఈ బహుమతి అందుకున్నారు. బొల్లంరెడ్డి రామకృష్ణను 44 ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో విశిష్ట అతిథిగా చంద్రబాబు లోకేష్ తో సమానంగా స్టేజ్ పై ఆసీనులు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ 44 ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాకు ఇంతటి అరుదైన గౌరవాన్ని అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, యువ మంత్రి నారా లోకేష్ కు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కు రుణపడి ఉంటానని అదేవిధంగా నన్ను ప్రోత్సహిస్తున్న గండేపల్లి మండల టిడిపి నాయకులు అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని మీ ప్రేమానురాగాలు అభిమానం నాకు అండగా ఉండటం వలన నా కుటుంబ సభ్యులు సహకారంతో ఆ భగవంతుని ఆశీస్సులతో పొందగలిగాను అని నేను భావిస్తు, అందరికీ ధన్యవాదాలు తెలియ చేసుకుంటున్నానని బొల్లంరెడ్డి రామకృష్ణ తెలియజేశారు.

## మరిడమ్మ హుండీ ఆదాయం లెక్కింపు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 30 :** పెద్దాపురం పట్టణంలో భక్తులపాలిట కొంగుబంగారంలా విరాజిల్లుతున్న మరిడమ్మ అమ్మవారి హుండీల ఆదాయాన్ని దేవాదాయ ధర్మాదాయ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో సోమవారం లెక్కించినట్లు మరిడమ్మ అమ్మవారి దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి తెలిపారు. 95 రోజులు కాలానికి హుండీల ద్వారా రూ. 6,40,303
అలాగే అన్నదాన హుండీ ద్వారా రూ. 80,130/- మొత్తం రూ. 7,20,433 ఆదాయం సమకూరిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వైభవంగా శ్రీశృంగార వల్లభ స్వామి కల్యాణం

**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 30::** మండల పరిధిలోని తిరుపతి గ్రామంలో కొలువై తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీ శృంగార వల్లభ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా కన్నులపండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కంకణధారణ, అగ్నిప్రతిష్టాపన, యజమాని సంకల్పం, భక్త సంకల్పం, మహాసంకల్పం, మంగళ సూత్రధారణ ఘట్టాలతో శాస్త్రోక్తంగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. చివరిగా నక్షత్రహారతి, మంగళహారతి కార్యక్రమంతో కల్యాణం ముగిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాసరావు, దేవస్థానం సిబ్బంది విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. కాగా కళ్యాణోత్సవంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, నిమ్మకాయల రంగనాగ్ పాల్గొని స్వామి, అమ్మ వార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కల్యాణ ఘట్టాన్ని నేత్రపర్వంగా తిలకించిన భక్తులు భక్తిపరవశంతో పులకించారు.

## మరిడమ్మ దేవస్థానంలో మఖ నక్షత్ర పూజలు



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 30 :** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం మఖ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారి గర్భాలయంలో ఉన్న మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి సుగంధభరితమైన వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాలు నడుమ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ పూజా కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ కె. విజయలక్ష్మి, వేద పండితులు ఇంద్రగంటి ప్రసాద్ శర్మ, నాగదేవర వెంకటశాస్త్రి, ఆలయ సిబ్బంది రమణ, తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురం నుండి శ్రీ పాద శ్రీ వల్లభ స్వామి వారి దివ్య దర్శనం...

## ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలి



జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్

**అమలాపురం/అంబాజీపేట,పెన్ పవర్, మార్చి 30:** జిల్లాలో ప్రజల భూ సంబంధిత సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించేందుకు రెవెన్యూ క్లినిక్ మరియు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ అన్ని శాఖల అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 178 అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రతి అర్జీపై వెంటనే స్పందిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమస్యల స్వరూపం, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల నుండి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం అందించాలని సూచించారు. సమస్య పరిష్కారం అయిన వెంటనే అర్జీదారునికి సమాచారం అందించడంతో పాటు, పరిష్కారం కాని అర్జీలకు కారణాలను స్పష్టంగా తెలియ జేయాలని తెలిపారు. డివిజన్, మండల, గ్రామ స్థాయిలలో నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాలకు సంబంధిత అధికారులు తప్పనిసరిగా హాజరై స్థానిక స్థాయిలోనే సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. ప్రజలు పైస్థాయికి వెళ్లే అవసరం లేకుండా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడం లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. ప్రతి శాఖ అధికారి తమ శాఖకు సంబం ధించిన ఫిర్యాదుల పురోగతిని ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ, నిర్దేశిత గడువులోపు పరిష్కారం చేయాలని సూచించారు. చిన్న సమస్యలైనా నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే స్పందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని బాధ్యతగా తీసుకుని సమయపాలన, ప్రజాస్పందన, పారదర్శకత అనే మూడు సూత్రాల ఆధారంగా పరిపాలన కొన సాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి మమ్మీ, డ్వామా పీడీ ఎస్ మధుసూదన్ తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.






## రూ. 1.46 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం - మంత్రి వాసంశెట్టి సుభాష్



* గంగవరం మండలంలో అభివృద్ధి జోరు
* సచివాలయాలు, సిమెంట్ రోడ్లు ప్రారంభం
* మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం -- మంత్రి సుభాష్



**కె. గంగవరం / రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 30:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గంలోని కె. గంగవరం మండలంలో రూ. 1 కోటి 46 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కోట గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, దంగేరు గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, అదే గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన రెండు సిమెంట్ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అలాగే శివల గ్రామంలో రూ. 43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం మరియు రూ. 9 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలను సమపాళ్లలో అమలు చేస్తూ, ప్రాధాన్యత క్రమంలో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాస్, ఎంపీడీవో ఎం. శ్రీనివాస్, ఏఈ యేసు రత్నం, టిడిపి మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, రామచంద్రపురం రూరల్ మండలం అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, నియోజకవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, డిసి అధ్యక్షులు నిడదవోలు సుబ్రమణ్యం, అలాగే పలు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ఏప్రిల్ 2తో పదవీకాలం ముగియనున్న కోట గ్రామ పంచాయతీ పాలకవర్గ సర్పంచ్ మరియు వార్డు సభ్యులను మంత్రి సుభాష్ సత్కరించారు. అనంతరం అదే గ్రామంలో శిధిలావస్థలో ఉన్న వంతెనను పరిశీలించారు.

## ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి విద్య శాఖ ఆదేశాలు

**అర్హులైన విద్యార్థులను నిర్ణీత గడువులోపు పాఠశాలలో చేర్చుకోవాలి...**



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 30:**ఆత్రేయపురం మండలం రాబోయే 2026-27 విద్యా సంవత్సరముకు విద్యా హక్కు చట్టం (ఆర్ టి ఈ 12 -1 సి) ప్రకారం 1వ తరగతిలో ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశం కొరకు ఆన్లైన్ ద్వారా ధరఖాస్తు చేసి, అడ్మిషన్ పొందిన విద్యార్థుల మొదటి స్పెల్ జాబితా విడుదల చేయడమైనదని మండల విద్యాశాఖాధికారులు పి. వరప్రసాద్, ఏ.సత్యనారాయణ అన్నారు. సంబంధిత పాఠశాలల్లో సీటు పొందిన 25 మంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను వచ్చే ఏప్రిల్ 7వ తేదీ లోగా చేర్పించాలని వారు తల్లిదండ్రులను కోరారు. సంబంధిత పాఠశాల యాజమాన్యం వారు అర్హత పొందిన విద్యార్థులను తమ పాఠశాలల్లో నిర్ణీత తేదీలోగా అడ్మిట్ చేసుకోవాలని వారు ఆదేశించారు.

## దివ్యాంగ పిల్లల గుర్తింపుపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 30:** దివ్యాంగ పిల్లలను తొందరగా గుర్తించడం ప్రతి అంగన్వాడీ కార్యకర్త బాధ్యత అని పారా సీబీఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమరావు తెలిపారు. సోమవారం ఆత్రేయపురం మండలంలోని లొల్ల, మెర్లపాలెం సెక్టార్లలో ఐసిడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలకు త్వరిత గుర్తింపు, సమన్వయం పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మూడు సంవత్సరాల లోపు అంగవైకల్యం గల పిల్లలను త్వరగా గుర్తిస్తే తగిన చర్యలు తీసుకుని వికలాంగత్వ తీవ్రతను తగ్గించవచ్చన్నారు. వివిధ రకాల అంగవైకల్యాలను గుర్తించే విధానాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్‌గా ల్యాంప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ, దివ్యాంగులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలు, ప్రత్యేక విద్య, సమ్మేళిత విద్య, వైద్యం, పెన్షన్లు, 2016 దివ్యాంగుల చట్టంలోని 21 రకాల అంగవైకల్యాలపై వివరించారు.

ఐసిడీఎస్ సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా కార్యకర్తలకు ఉపయోగకరమైన సమాచారం లభించిందని, గ్రామాల్లో పిల్లలను గుర్తించి వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 54 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాళ్లూరులో బీసీ ఆత్మీయ సమావేశం విజయవంతం చేసిన వారందరికీ కృతజ్ఞతాభివందనములు:

- బీసీ సంక్షేమ సంఘం కమిటీ :



**గండేపల్లి,పెన్ పవర్,మార్చి,30:** గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఆదివారం జరిగిన బిసి ఐక్యవేదిక ఆత్మీయ సమావేశానికి సభాధ్యక్షులుగా ఉండి ముందుకు నడిపిన ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పంపన రామకృష్ణకు ప్రత్యేక అభినందనలు తెలుపుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ మార్గాని నాగేశ్వరావు, అఖిలభారత పద్మశాలి పురోహిత సంఘం అధ్యక్షులు ఆమంచి ఆంజనేయ గురుస్వామి, బీసీ జాతీయ ఉపాధ్యక్షులు కుండల సాయి బొందు లీల రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ శంకర్ సింగ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచికట్ల రామకృష్ణ యాదవ్ బీసీ సంక్షేమ సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షులు వియ్యపు అప్పలస్వామి, చాత్తాడ శ్రీ వైష్ణవ సంఘ కార్యవర్గ సభ్యులు ముష్టి గూ డల సూర్య భాస్కర్ రావు తాళ్లూరు గ్రామ సర్పంచ్ శీలా మంతుల వీరబాబు ఈ కార్యక్రమాన్ని తలపెట్టినప్పటి నుండి అహర్నిశలు కృషి చేసి మాకు సహాయ సహకారాలు అందించిన వారందరికీ వివిధ బీసీల నాయకులు వారి వారి వ్యాఖ్యానాల ద్వారా మమ్ములను తాళ్లూరులో ఉన్న బీసీ ప్రజలను చైతన్యపరిచి ఐక్యత భావం పెంపొందించినందుకు వారికి పేరుపేరునా మా హృదయపూర్వక కృతజ్ఞతాభివందనములు తెలియజేస్తున్నామని సమావేశానికి విచ్చేసిన బీసీ కుల సోదర సోదరీమణులకు అందరికీ మా హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నామని తాళ్లూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అయినవిల్లి దుర్గాప్రసాద్ , ఆబోతుల అప్పారావు రెడ్డి, పద్మశాలి సంక్షేమ సంఘం అధ్యక్షులు కాకి వెంకటరమణ సెక్రటరీ చెల్లూరు రఘుపతిరావు, చింతలపూడి శ్రీనివాస్ శ్రీకృష్ణ యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు కోన సత్తిబాబు, సెక్రటరీ సందక సత్యమూర్తి శ్రీశ్రీశ్రీ దెక్కల పోలమ్మ తల్లి రెడ్డిక యువజన సంఘం అధ్యక్షులు జీరు సీతయ్య సెక్రటరీ బుచ్చ వాసు రజక సంక్షేమ సంఘం అధ్యక్షులు నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు తుమ్మూరి పవన్ కుమార్, మేరేటి శ్రీనివాసరావు, తేలు శ్రీనివాసరావు ( బాబి ) పొన్నగంటి సత్యనారాయణ ఎలిదిండి బాబురావు, ఎలిదిండి రామకృష్ణ మొదలైన వారు తెలిపారు.

# అమలాపురం నియోజకవర్గంలో 100 మంది నిరుద్యోగులను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం



**ఎమ్మెల్యే ఆనంద రావు.**

**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమం కేవలం ఒక పథకం మాత్రమే కాదని, ఇది పేదరికాన్ని రూపుమాపే ఒక గొప్ప సామాజిక ఉద్యమమని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు.

అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్ లో నిర్వహించిన పి4 అవగాహన సదస్సులో అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమం కేవలం ఒక పథకం మాత్రమే కాదని, ఇది పేదరికాన్ని రూపుమాపే ఒక గొప్ప సామాజిక ఉద్యమమని అభివర్ణించారు. ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు దాతృత్వం కలిగిన వ్యక్తులు కలిసి పేద ప్రజల అభివృద్ధికి తోడ్పడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. సమాజంలో నిశబ్దంగా సేవ చేసే మార్గదర్శకులను గుర్తించి, వారి స్ఫూర్తితో మరికొందరిని భాగస్వాములను చేస్తూ పేదవాడి దరిద్రం పోగొట్టేలా ఈ వేదిక పనిచేస్తుందని ఆయన అన్నారు.

ముఖ్యంగా నిరుద్యోగ యువతకు కేవలం ఆర్థిక సహాయమే కాకుండా, వారికి అవసరమైన వృత్తి విద్యా శిక్షణ ఇప్పించి, వారి కాళ్ల మీద వారు నిలబడేలా చేయడమే పి4 లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తన పదవీకాలం ముగిసేలోపు కనీసం వంద మంది నిరుద్యోగుల ను చిన్నపాటి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే తన ఆశయమని ఆయన వెల్లడించారు. అలాగే డ్వాక్రా మహిళల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి నియోజకవర్గంలోని పది గ్రామాల్లో ఇప్పటికే పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామని, దీనివల్ల మహిళలకు ఆదాయంతో పాటు కల్తీ లేని స్వచ్ఛమైన పాలు అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కల్తీ ఆహారం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు ఇంటింటికీ విస్తరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రతి కుటుంబం తమ పెరట్లోనే కూరగాయలు పండించుకునేలా ఉపాధి హామీ పథకం ఎంఎన్ఆర్ఈజిసి ద్వారా ప్రోత్సాహం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. స్వచ్ఛమైన ఆహారం, పాడి పశువుల పెంపకం ద్వారానే ఆరోగ్యం సాధ్యమని ఆయన గుర్తు చేశారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వంద ఏళ్లు పూర్తయ్యే 2047 నాటికి దేశంలో పేదరికం అన్నది ఉండకూడదన్న గొప్ప సంకల్పంతోనే ప్రధాని మోదీ 'వికసిత్ భారత్', ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'పి4' కార్యక్రమాలను రూపొందించారని ఆయన వివరించారు. ఈ గొప్ప ఆశయాన్ని నెరవేర్చడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత గల పౌరులుగా భాగస్వాములు కావాలని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను రాష్ట్రంలోనే పి4 అమలులో అగ్రస్థానంలో నిలబెట్టాలని ఎమ్మెల్యే ఆనందరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## అండర్ -9 జిల్లా చదరంగ పోటీల్లో సత్తా చాటిన అమలాపురం డీపీఎస్ విద్యార్థులు





**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:**అమలాపురంలో మార్చి 29న జరిగిన కోనసీమ డిస్టిక్ అండర్ -9 చెస్ ఛాంపియన్షిప్ లో పోటీల్లో అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ బి శాన్వి ప్రథమ స్థానం సాధించగా ఓపెన్ కేటగిరీ నుండి మోక్స్ సైనీ తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని కోచ్ వి శ్రీనుబాబు తెలియజేశారు. వీరు వచ్చే నెల 18, 19 తేదీల్లో అన్నవరంలో జరిగే అండర్ -9 రాష్ట్ర స్థాయి చదరంగ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా నలుమూల నుండి వచ్చిన ఆటగాళ్లలో 8 సంవత్సరాల శాన్వి మొదటి స్థానం సాధించి జిల్లా ఛాంపియన్ గా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికావడం ఎంతో హర్షించదగ్గ విషయమని కొనియాడారు. చదువుతో పాటు ప్రతీ చదరంగ పోటీల్లో కూడా ప్రథమ స్థానాలు సాధిస్తున్న విద్యార్థినీలను స్కూల్ యాజమాన్యం , చైర్మన్ నాయుడు, డైరెక్టర్ నంద్యాల మనువిహార్ లు అభినందించారు.

## రూ. 50 లక్షలతో దుగ్గుదూరులో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం





- **గ్రామీణ ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి**
- **హెల్త్ యూనిట్ ప్రారంభించిన వాసంశెట్టి సత్యం**

**కాజులూరు, పెన్ పవర్,మార్చి 30:**రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం దుగ్గుదూరు గ్రామంలో రూ. 50 లక్షల వ్యయంతో 15వ ఆర్థిక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ హెల్త్ యూనిట్ ద్వారా మండలంలోని ప్రజలకు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధుల పరీక్షలు సహా పలు రకాల వైద్య పరీక్షలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన, ఆధునిక వైద్య సేవలను సమీపంలోనే అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ కె.వి. సుబ్బరాజు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వై. సుప్రియ, డాక్టర్ జి. స్వాతి, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది, కూటమి పార్టీ నాయకులు మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (పెద్ద), జనసేన మండల అధ్యక్షులు బొండా వెంకన్న, కొప్పిశెట్టి స్వామి నాయుడు, డి.సి. లకాని కృష్ణ చైతన్య, గ్రామ సర్పంచ్ పోతు వెంకటలక్ష్మి జ్యోతి కుమార్, రంపల రాజు, రెడ్డి శేషారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలలో "అభివృద్ధి చెందుతున్న సాంకేతికత" అనే అంశం పై రెండవ విడత మూడు రోజుల అవగాహన మరియు ప్రాయోగిన శిక్షణ





**గండేపల్లి,పెన్ పవర్,మార్చి,30:**గండేపల్లి మండలం సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల వారి ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ పాఠశాలల విద్యార్థుల కోసం మార్చి 30 నుండి ఏప్రియల్ 1 వతేదీ వరకు మూడు రోజుల "అభివృద్ధి చెందుతున్న సాంకేతికత" అనే అంశంపై రెండవ విడత అవగాహన సదస్సు మరియు ప్రాయోగిక శిక్షణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడుతుందని కళాశాల చైర్మన్ డా॥ పరుచూరి కృష్ణారావు తెలియజేసారు. ఈ కార్యక్రమం భారత ప్రభుత్వ విజ్ఞాన సాంకేతికశాఖ (డి ఎస్ టి ) ఆధ్వర్యంలో "చిల్డ్రన్ సెంట్రిక్ అవుట్ రిచ్ ప్రోగ్రాం " ద్వారా ప్రాయోజితమైనదని, ఈ కార్యక్రమంలో బిక్కవోలు, పెద్దాపురం, రంగంపేట గ్రామీణ పాఠశాలలనుండి వచ్చిన 334 మందివిద్యార్థులు పాల్గొన్నారని ఈ సందర్భంగా ఆయన తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు (ఏఐ ), సైబర్ భద్రత, ఇంటర్నెట్ ఆఫ్థింగ్స్ (ఎల్ ఓ టి ), మొబైల్ అప్లికేషన్లు వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతల పై అవగాహన కల్పించడం మరియు వాటిని సురక్షితంగా, సమర్థవంతంగా ఉపయోగించడం పై శిక్షణ ఇవ్వబడ్డాయని, ఇలాంటి కార్యక్రమాలు పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం పై అవగాహనకల్పించి, బాధ్యతాయుతంగా సాంకేతికతను వినియోగించేలా మారుస్తాయని తెలిపారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా॥ జి. నరేష్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ పాఠశాల దశ నుండే ఏఐ సాధనాలను ఉపయోగించడం, సైబర్ దాడుల నుండి తమను తాము రక్షించుకోవడం, మొబైల్ అప్లికేషన్లను విద్యా ప్రయోజనాల కోసం వినియోగించడం వంటి అంశాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా॥ వి. ప్రశాంత్, డి.ఎస్.టి , భారత ప్రభుత్వానికికృతజ్ఞతలు తెలుపుతూ, ఈ కార్యక్రమాన్ని తమ కళాశాలకు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భాగంగా పరిశ్రమ మరియు అకాడమియా నుండి వచ్చిన నిపుణులు ఉపన్యాసాలు ఇవ్వడం, హ్యాండ్స్-ఆన్సెషన్లు, ప్రాజెక్ట్ ఎక్స్పో మరియు వైద్య శిబిరం వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు.

ఈకార్యక్రమానికి డైరెక్టర్ (మేనేజ్మెంట్) శ్రీ ఎం.వి. హరినాథబాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం. సతీష్, డైరెక్టర్-అకడమిక్స్ డా॥ కె. సత్యనారాయణ, డీన్-కెరియర్ డెవలప్మెంట్ సెల్ డా॥ ఎం. రాధికామణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా॥ వై. జయబాబు, వివిధ విభాగాధిపతులు, సీనియర్ అధ్యాపకులు మరియు విద్యార్థులు హాజరయ్యారు.

## ఒకలమాత అన్నదాన భవనం లో డైనింగ్ టేబుల్ పరిశీలించిన ఎమ్మెల్యే బండారు



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 30:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న నూతన వకుళామాత అన్నదాన భవనం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ భవనానికి అవసరమైన డైనింగ్ టేబుల్‌లను కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్వయంగా పరిశీలించి ఎంపిక చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అన్నదానం కోసం వచ్చే భక్తులు సౌకర్యవంతంగా భోజనం చేయగలిగే విధంగా ఆధునిక సదుపాయాలతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. టేబుల్‌ల నాణ్యత, బలాన్ని పరిశీలించి భక్తులకు అనువైనవాటినే ఎంపిక చేసినట్లు వివరించారు. ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అన్నదాన భవనం విస్తరణ అవసరమైందని పేర్కొన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

# రైతులకు అన్యాయం జరుగుతుందంటూ ఆగ్రహం



- కోనసీమ జిల్లాలో రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది.
- చిర్ల జగ్గిరెడ్డి కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు

**రావులపాలెం పెన్ పవర్ మార్చి 30:**రావులపాలెంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాజధాని అంశంపై తీసుకున్న తాజా తీర్మానాన్ని తీవ్రంగా ఎద్దేవా చేశారు. "పిల్లలు పుట్టిన తర్వాత మళ్లీ పెళ్లి చూపులు పెట్టినట్టుగా ఉంది ఈ నిర్ణయం" అంటూ విమర్శించారు. రాజధాని పేరుతో కూటమి ప్రభుత్వం భారీ స్థాయిలో స్కాం చేస్తున్నదని ఆరోపించారు.

పాత రైతులకు న్యాయం చేయకుండా కొత్త రైతులను మోసం చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. 2014--2019 మధ్య కాలంలో అధికారంలో ఉన్నప్పుడు అమరావతిని స్పష్టంగా రాజధానిగా ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు.

అలాగే ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై వ్యాఖ్యలు చేస్తూ, "కేవలం పులివెందుల ఎమ్మెల్యే ఒక్కరినే చూసి అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఎందుకు భయపడుతున్నారు?" అని ప్రశ్నించారు.కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుపై కూడా జగ్గిరెడ్డి ఆరోపణలు చేశారు. నియోజకవర్గంలో బెల్ట్ షాపులు, లిక్కర్, ఇసుక, మట్టి మాఫియాలతో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. "బెల్ట్ షాపులు పెడితే బెల్ట్ తీస్తానన్న ముఖ్యమంత్రి, ఇప్పుడు ఎప్పుడు చర్యలు తీసుకుంటారు?" అని ప్రశ్నించారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు 'మీ ఇంటికి మీ డాక్టర్'





**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:**మత్స్యకారుల కుటుంబాల ముంగిటకే వైద్య సేవలు -- 'మీ ఇంటికి మీ డాక్టర్' మొబైల్ క్లినిక్ ప్రారంభించిన : జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్.

ఆర్.ఈ.సి ప్రాజెక్ట్ సౌజన్యంతో జిల్లావ్యాప్తంగా ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో నివసించే మత్స్యకారుల నిరుపేద కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలను వారి ఇంటి వద్దకే చేరవేసే లక్ష్యంతో 'మీ ఇంటికి మీ డాక్టర్' అనే వినూత్న మొబైల్ క్లినిక్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఆర్.మహేష్ కుమార్ సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ , డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ సహకారంతో ఆర్.ఈ.సి ప్రాజెక్ట్ సౌజన్యంతో అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కింద ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ క్లినిక్ వాహనం ద్వారా జిల్లాలోని మత్స్యకార గ్రామాలకు నేరుగా చేరుకుని ఉచిత వైద్య సేవలు అందించనున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ మరియు దూర ప్రాంతాల్లో నివసించే మత్స్యకారులు వైద్య సదుపాయాలకు దూరంగా ఉండటం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ఆసుపత్రులకు వెళ్లలేని పరిస్థితుల్లో ఈ మొబైల్ క్లినిక్ వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. శిశు మరణాలు, మాతృ మరణాల తగ్గించడం, అంటువ్యాధుల నియంత్రణ, గ్రామీణ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాలని జిల్లా కలెక్టర్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన జిల్లాల్లో సుమారు రూ. 8.40 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్ట్ అమలు అవుతోందని తెలిపారు.

జిల్లాలో ఈ సేవలు నిరంతరం కొనసాగేందుకు రెడ్ క్రాస్ ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందేలా పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు.

డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ స్పెషల్ ఆఫీసర్ ఏవో కాశి విశ్వేశ్వరరావు నేతృత్వంలో ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు అవుతుండగా, జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ హరి శేషు మాట్లాడుతూ, ఈ మొబైల్ క్లినిక్ యూనిట్ ద్వారా ఒక డాక్టర్, నర్సు, ఫార్మసిస్ట్, డ్రైవర్‌తో కూడిన వైద్య బృందం నేరుగా గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తుందని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడం మాత్రమే కాకుండా, అవసరమైన మందులను కూడా అక్కడికక్కడే ఉచితంగా అందజేయడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తుందని చెప్పారు. మారుమూల గ్రామాల్లో నివసించే ప్రజలకు ఇది ఒక వరంగా మారుతుందని తెలిపారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, మార్చి 30 :**నగరపాలక సంస్థ చేపట్టే అభివృద్ధి పనుల్లో నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలు, కాలపరిధి పాటించాలని కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. 9 వ వార్డులోని మహాలక్ష్మి నగర్ మెయిన్ రోడ్డు, శ్రీనివాస నగర్లో పూర్తయిన ఆర్.సి.సి. డ్రెయిన్ల నాణ్యతను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. నగరపాలక సంస్థ చేపట్టిన ప్రతి పనిలో నాణ్యతలో ఎలాంటి పరిస్థితుల్లో రాజీ పడరాదని కమిషనర్ పేర్కొన్నారు. నిర్మాణ సమయంలోనే వార్డు సచివాలయ ఎమినిటి కార్యదర్శులు ప్రతి దశలో పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. క్వాలిటీ కంట్రోల్ ఏజన్సీ ప్రతినిధులు కూడా పనులను స్టేజిల వారీగా పరిశీలించి, రిపోర్ట్ సిద్ధం చేయాలన్నారు . ఎక్కడైనా లోపాలు గుర్తిస్తే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చేసిన పనులకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని.. కేటాయించిన నిధులు ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం వెంకటేశ్వర నగర్లో పూర్తయిన రహదారి నాణ్యతను పరిశీలించారు. ఈ పర్యటనలో ఎస్ఈ రీటా, డీఈ లోవరాజు, ఏఈ దుర్గాప్రసాద్, ఇతర ఇంజనీరింగ్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది ఉన్నారు.


## దివ్యాంగ పిల్లల త్వరిత గుర్తింపు ప్రతి అంగన్వాడి కార్యకర్త యొక్క బాధ్యత

**పారా సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమరావు**




**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 30;**మూడు సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లల త్వరిత గుర్తింపు ప్రతి అంగన్వాడి కార్యకర్త యొక్క బాధ్యతని పారా సిబిఆర్ కోఆర్డినేటర్ బడుగు మహిమారావు అన్నారు.ఆయన అధ్యక్షతన ఆలమూరు మండలంలోని పెనికేరు గ్రామంలో సోమవారం అంగన్వాడీ సెంటర్ వద్ద కార్యకర్తలకు దివ్యాంగ చిన్నారుల త్వరిత గుర్తింపు, సమన్వయంపై శిక్షణ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహిమారావు మాట్లాడుతూ మూడు సంవత్సరాల లోపు అంగవైకల్యం గల పిల్లలను తొందరగా గుర్తించగల్గుతే తగిన విధముగా చర్యలు తీసుకుని వికలాంగత్వ తీవ్రతను తగ్గించవచ్చు అన్నారు. ఏఏ రకాల వికలాంగత్వాలు ఉన్నాయి వాటిని ఎలా గుర్తించాలనే విషయంపై వివరించారు. అలాగే రిసోర్స్ పర్సన్ గా ల్యాంప్ అడ్వకేసి కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ మాట్లాడుతూ దివ్యాంగులకు ఉన్నటువంటి సంక్షేమ పథకాలు, స్పెషల్ ఎడ్యుకేషన్, సమ్మేళతవిద్య, వైద్యం, పెన్షన్లు గురించి , 2016 దివ్యాంగుల చట్టం, 21 రకాల అంగవైకల్యం గురించి వివరించారు.ఐసిడిఎస్ పెనికేరు సూపర్వైజర్ సత్యవేణి మాట్లాడుతూ పారా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం విశేషం అన్నారు.మూడు సంవత్సరాలలోపు దివ్యాంగ పిల్లల విషయంలో ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులను ఐక్యంగా ఎదుర్కొందాం




**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 30:**రాష్ట్రంలో ఇటీవల ఎస్సి మాలల పై అనేక దాడులు, దౌర్జన్యాలు,దారుణాలు చోటు చేసుకున్నాయని, మాలల పై వివక్షత చూపుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రోత్సహిస్తుందని కాట్రేనికోన మండల వైకాపా మహిళా విభాగం అధ్యక్షురాలు,ఎం పి టి సి సభ్యురాలు,మోకా చంద్ర నాగరత్నం అన్నారు.అంటరాని తనం అనే మహామ్మారిని మళ్ళీ వ్యాపింప జేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఇటీవల డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం కుందనాపల్లి గ్రామం లో ఒక దళిత మృతదేహాన్ని స్మశాన వాటిక కు తీసుకెళ్లే క్రమంలో అగ్రకులాల వారు అడ్డుకోవడం హేయమైన చర్య అని ఆమె అన్నారు. కాట్రేనికోన ఆమె నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. దళితులపై ముఖ్యంగా మాలలపైన ఎన్ని దాడులు జరిగినా ప్రభుత్వం కానీ, అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ కనీసం స్పందించిన దాఖలాలు లేవని ఆమె అన్నారు.ఇటీవల భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఎస్సిలను తుద ముట్టించాలానే లక్ష్యం తో రిషర్వేషన్లు అనే పదం లేకుండా చేయాలనే ఉద్దేశ్యం తో రాజ్యాంగం కల్పించిన హక్కుల ను కాలరాస్తూ ఎస్సి లు ఏ మతం లో కొనసాగాలి,ఏ దేవుడు ని కొలవాలి అని ఆంక్షలు పెట్టడం సరి కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సనాతన ధర్మం అనే సాకుతో దళితులను అనగ ద్రొక్కటానికి అనేక దాడులు చేస్తున్నారని దళితులందరు పార్టీలకతీతంగా ఐకమత్యంతో ఏకమై పోరాటం చేయాలని అన్నారు. పోరాటం చేయడం ద్వారా మాత్రమే మన హక్కులను సాధించుకోవచ్చునని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎప్పుడో చెప్పారని ఆమె తెలిపారు.

## జగన్మోహిని కేశవ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాతలు



**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 30:**డా. ఆర్ బి.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ గోపాల స్వామి వారి దేవస్థానంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకుంటున్నారు. సోమవారం హైదరాబాద్ మహానగరం చెందిన వెంకటమహాదేవ కుమార్ దంపతులు స్వామివారిని దర్శించుకుని ఆలయ అభివృద్ధి కి 5,116 రూ విరాళం సమర్పించారు. అలాగే కాకినాడ పట్టణానికి చెందిన గంగరాజు దంపతులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో జరిగే నిత్య అన్నదానం పథకానికి 5116 రూ, విరాళంగా సమర్పించారు. వీరిని ఆలయ వేద పండితులు అవధాని వేద ఆశీర్వచనం చేయగా ఆలయ కార్య నిర్వహణ అధికారి బి వెంకటరమణమూర్తి స్వామివారి చిత్రపటం శేష వస్త్రంతో సత్కరించారు.

## శ్రీ కోదండరామాలయంలో వైభవంగా సుదర్శన హోమం



**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:**కొర్లపాటి వారిపాలెంలో వేంచేసియున్న శ్రీ కోదండరామ స్వామివారి ఆలయంలో వైభవంగా సోమవారం సుదర్శన హోమం నిర్వహించారు. శ్రీ రామనవమి సందర్భంగా శ్రీ కోదండరామ స్వామి వారికి పంచామృత అభిషేకం, తులసి పూజ, సుదర్శన హోమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయాన్ని పూలతో ప్రత్యేక అళమకరణ చేసారు. ఆలయ పురోహితులు ఫణి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమంలో జరిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## భవ్య కు ఉత్తమ సేవ అవార్డు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 30;**క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా ఉత్తమ సేవలు అందించినందుకుగాను భవ్య హెల్త్ సర్వీసెస్ కు చెందిన ఆలమూరు మండపేట రామచంద్రపురం ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎస్ వెంకట్ లక్ష్మి కి ఇటీవల ఉత్తమ సేవ ప్రశంస పత్రం అందించడం జరిగింది.

అమలాపురంలోని కలెక్టరేట్లోని ఉన్న గోదావరి భవన్లో జరిగిన ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని టీబి ముక్తభారత్ అభియాన్ క్రింద వంద రోజుల ప్రచార కార్యక్రమాల సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఎం దుర్గారావు దొర, అదనపు వైద్యాధికారి డాక్టర్ భరత్ లక్ష్మి చేతుల మీదుగా ఈ ప్రశంసా పత్రం అందుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో భవ్య ఫీల్డ్ కోఆర్డినేటర్లు మిరియం వాణి తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట అన్న క్యాంటీన్లో అన్నదానం




**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 30:** స్థానిక కాకినాడ రోడ్ లోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అన్నా క్యాంటీన్ కు ఈ వారం జగ్గంపేట మండలం రాజపూడి గ్రామానికి చెందిన రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి వెంకటేశ్వరరావు (బుల్లబ్బు), టిడిపి సీనియర్ నాయకులు కందుల విశ్వేశ్వర రాంబాబు(పూస), టిడిపి యువనేత గొర్రిపాటి కార్తీక్ వారి ఆర్థిక సహాయం అందించారు. కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా హాజరై పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నా క్యాంటీన్లు రద్దు చేయటాన్ని నిరసిస్తూ గత ఐదు సంవత్సరాలుగా జగ్గంపేటలో అన్న క్యాంటీన్ నిర్వహిస్తున్నామన్నారు. తొందర్లోనే ప్రభుత్వ అన్న క్యాంటీన్ ప్రారంభమవుతుందని నవీన్ అన్నారు. ఈ కార్యక్రమంలో జీను మణిబాబు, రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 30**: జగ్గంపేట మండలం గొల్లలగుంట గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన గ్రామానికి చెందిన గండికోట కృష్ణ అప్పలరాజు వెంకటలక్ష్మి దంపతుల గృహప్రవేశానికి జగ్గంపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జీను మణి బాబు హాజరై గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు తాళాలు అందించారు. రాష్ట్రంలో చంద్రబాబు, జగ్గంపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సారధ్యంలో సొంత ఇల్లు స్థలం ఉండి గృహాన్ని నిర్మించుకునే వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ ఎల్ శ్రీనివాస్, డిఈ వి.శ్రీనివాస్, ఏఈ డి.శేఖర్, ఏఈ పీలా మణికంఠ, గ్రామ టిడిపి నాయకులు చింతాకల ఈశ్వరరావు, తిరుమల రాజు మురళి రాజు, శేఖర్ రాజు, రాయుడు గోవిందు, పెద్ద మురళి రాజు, గంజా శివ నారాయణ, రేగుళ్ల రమణ, సిహెచ్ రాజు, చిత్రపు బాబు, రాయుడు కాటమరాజు, గంజా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత నివారించాలి



**పెద్దాపురం, పెన్ పవర్, మార్చి 30:** నిత్యం పెరుగుతున్న ధరలతో కునారిల్లుతున్న సామాన్యుడిపై గ్యాస్ కొరత రూపంలో మరో భారం పడుతోందని సీపీఎం పెద్దాపురం మండల కమిటీ మండిపడింది. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో నెలకొన్న తీవ్ర అంతరాయం వల్ల ప్రజలు పడుతున్న కష్టాలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌లో ఆ పార్టీ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతి కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వల్ల వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ కొరత లేదని పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నా, క్షేత్రస్థాయిలో గంటల తరబడి క్యూలైన్లలో నిల్చున్న జనం గోడు పాలకులకు వినిపించడం లేదా?" అని నిలదీశారు. యుద్ధాల సాకుతో కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం, సామాన్య ప్రజల పొయ్యి వెలిగే మార్గాన్ని మాత్రం మూసేస్తోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ రవాణా, బ్లాక్ మార్కెట్ విచ్చలవిడిగా సాగుతోందని, దీనివల్ల చిరు వ్యాపారులు తమ ఉపాధిని కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ మనుగడకు 'ఆక్సిజన్'లా మద్దతు ఇస్తున్న తెలుగుదేశం పార్టీ ఆ చొరవను ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి గ్యాస్ కొరతను తీర్చాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కూనిరెడ్డి అప్పన్న, డి. సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, రొంగల సుబ్బలక్ష్మి, సిరిపురపు మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో కోటి 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు సేవా కేంద్రం, మరియు స్వర్ణాంధ్ర గ్రామం కార్యాలయాలు





- ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

**గండేపల్లి,పెన్ పవర్,మార్చి,30:** గండేపల్లి మండలంలో సోమవారం జగ్గంపేట శాసనసభ్యులు, టిడిపి బోర్డ్ మెంబర్ జ్యోతుల నెహ్రు రైతు సేవా కేంద్రం, మరియు స్వర్ణ గ్రామాల కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. ముందుగా మల్లేపల్లి గ్రామం లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు 23 లక్షల 90 వేల రూపాయలు వ్యయంతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను ఆధ్వర్యంలో ప్రారంభించారు. అలాగే అదే గ్రామంలో అన్నపరాజుపేటలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 43 లక్షల అరవై వేల రూపాయల నిధులతో నిర్మించిన స్వర్ణ గ్రామం కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్టీ రాజాపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 40 లక్షల అరవై వేల రూపాయలు వ్యయంతో నిర్మించిన స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు, ప్రజలకు సేవలందించే దిశగా కార్యాలయాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తద్వారా ఆయా గ్రామాలలోనే గ్రామ ప్రజలకు సంబంధిత అధికారుల ద్వారా సేవలు అందించడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు నేరుగా అందే విధంగా గ్రామాల నుండి పటిష్ట పట్టడం జరుగుతుందని తద్వారా అర్హులైన లబ్ధిదారులు గ్రామాలలోని సేవలు పొందొచ్చు అన్నారు. అంతేగాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రాభివృద్ధి కోసం ఎన్నో ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. ముందుగా ఈ కార్యక్రమాలను గ్రామ సర్పంచ్ దొమ్మ శ్రీను స్వగృహం నుండి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు పూలతో ఘన స్వాగతం పలకగా వేద పండితులు కుమార్ ఆధ్వర్యంలో మంత్రోత్సవాలన ద్వారా కార్యక్రమాలు ప్రారంభించగా ఈ కార్యక్రమంలో గండేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పోతుల మోహనరావు, ఎస్ వి ఎస్ అప్పలరాజు, కాటేపల్లి భద్రం, దిడ్డి శ్రీనివాస్ , పంచగట్ల రామకృష్ణ, తదితరులతో పాటు పంచాయతీ రాజ్ డి ఈ ఉమాశంకర్ , జై రాజేష్, అగ్రికల్చర్ డీజి నాగ కుమార్, మండల వ్యవసాయ అధికారిని లక్ష్మి, అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## అవెతి గ్రామంలో అగ్ని ప్రమాదం బాధిత కుటుంబానికి మురళీకృష్ణంరాజు పరామర్శ

- బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలి.
- 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన ముదునూరి.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్ మార్చి 30**:కాకినాడ జిల్లా శంఖవరం మండలం వేలంగి గ్రామ పంచాయతీ పరిధిలోని అవెతి గ్రామంలో గోము చల్లయమ్మ తాటాకు ఇల్లు ఇటీవల కాలంలో అగ్ని ప్రమాదంలో పూర్తిగా కాలిపోయి కట్టు బట్టలతో మిగిలారు. దీంతో విషయం విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీకృష్ణంరాజు అగ్ని ప్రమాద బాధితురాలు చల్లయమ్మ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా, ఆ నిరుపేద గిరిజన బాధిత కుటుంబానికి 10,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తు రోజుల్లో చల్లయమ్మ కుటుంబానికి ఏ కష్టం వచ్చిన అండగా ఉంటామని మురళీ కృష్ణంరాజు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో పూర్తిగా నిరాశ్రయులైన చల్లయ్యమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవడమే కాకుండా,పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేలంగి సర్పంచ్ మేకల సుబ్బలక్ష్మి,సత్యనారాయణ,మాజీ ఎంపీటీసీ గుత్తుత్తి నాగేశ్వరరావు,బౌవురువాక గ్రామ సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ,గౌరంపేట గ్రామ సర్పంచ్ రామిశెట్టి ఏసుబాబు,పెద్దమల్లాపురం సర్పంచ్ చెంచుబాబు, జీడం గణేష్, నిండికుండల నారాయణమూర్తి,పూసల ఏసుబాబు,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పి 4 మొదటి వార్షికోత్సవం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణమ్మ






**గండేపల్లి, పెన్ పవర్,మార్చి,30:** కూటమి ప్రభుత్వం ప్రతిష్టంకంగా చేపట్టిన పి.4 కార్యక్రమం మొదటి వార్షికోత్సవం సందర్భంగా గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట 16వ నెంబర్ జాతీయ రహదారి ఆనుకుని ఉన్న శుభమస్తు కళ్యాణ మండపంలో జగ్గంపేట నియోజకవర్గం ప్రత్యేక అధికారి, జిల్లా గృహ నిర్మాణ శాఖ వివి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు జ్యోతుల నెహ్రూ సతీమణి మనమ్మ పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి జూ4 విధానాన్ని అక్కడ పాల్గొన్న వారి సమక్షంలో లైవ్ వీక్షించారు. అనంతరం ప్రత్యేక అధికారి సత్యనారాయణ మాట్లాడుతూ ఈపూర్ విధాల యొక్క ఇది విధానాలను వివరించారు. అలాగే జూ4 విధానంలో సేవలందించిన పలువురులను స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి పరిచయం చేసి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ విజన్ 2047 లక్ష్యంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పి.4 బడుగు బలహీన వర్గాలకు ఎంతకాలం ఉపయోగపడుతుందన్నారు . నియోజవర్గంలో 7000 మంది బంగారు కుటుంబాలు ఉండగా ముందుగా నాలుగు వేల మంది బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారికి చేయూత అందించడం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ప్రత్యేక అధికారి సత్యనారాయణ దృశ్యాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, జీను మణిబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, ఆడ బాల భాస్కరరావు, నాగేంద్ర, నాలుగు మండలాల ఎంపీడీవోలు,, వివిధ శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పి4 మార్గదర్శిగా బాపన్న దొర

**వై రామవరం, పెన్ పవర్,మార్చి 30 :** రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో పీ4 మార్గదర్శిగా వైరామవరం ఎంపీడీవో కే. బాపన్న దొరను ఎంపిక చేసి సోమవారం రంపచోడవరం లో సన్మానించారు.

ప్రభుత్వం ఆదేశానుసారం 2047 ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పి4 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో పి4 అమలు చేయడంలో అందరికీ మార్గదర్శిగా నిలిచిన వై.రామవరం ఎంపీడీవో కే.బాపన్న దొరను సోమవారం స్థానిక ఎమ్మెల్యే శిరీష దేవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోల్ల బొజ్జి రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బచ్చు స్మరణ రాజ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపేట






**–జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.**

**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి 30:** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. సోమవారం కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో 23.94 లక్షల రూపాయలతో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. 2025 2026 బడ్జెట్ లో రైతు సంక్షేమానికి 52వేల కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యాంత్రీకరణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులుకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలోగ్రామ సర్పంచ్ జ్యోతుల సీతారామలక్ష్మి, ఉప సర్పంచ్ సూతి శ్రీను, ఎస్ వి ఎస్ అప్పలరాజు, జంపన వెంకట సీతారామచంద్రవర్మ, జంపన రవివర్మ, జ్యోతుల పద్మనాభం, గంగిరెడ్ల దొరబాబు, నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల కోటి, పేపకాయల బుజ్జి, జ్యోతుల సూరిబాబు, పంచాయతీ రాజ్ డి ఈ, వై ఉమాశంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వాడపల్లిలో వెంకన్న గ్రామోత్సవం వైభవం





పొన్న వాహనంపై స్వామివారి భక్తులకు దర్శనం

**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 30:**డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని వాడపల్లిలో కోనసీమ తిరుమలగా పేరుగాంచిన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో కలిసి స్వామివారు పొన్న వాహనంపై ఆలయ ప్రాంగణంలో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవను వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయం పరిసరాలు భక్తులతో కళకళలాడాయి .వేకువజామున మేలుకొలుపు సేవతో కార్యక్రమాలు ప్రారంభమై, తీర్థ బిందె తెచ్చుట, విశేషార్చన, నిత్య హోమం, బలిహరణ, ద్రవిడ వేద పారాయణ, నీరాజనం, మంత్రపుష్పం వంటి పూజా కార్యక్రమాలు ఆచారసంప్రదాయాల ప్రకారం నిర్వహించారు.ఈ ఉత్సవాలను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు తమ్మన సాయి ప్రసాద్, చలుమూరి రాంబాబు, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## బత్తిన శేషారావు కుటుంబానికి ముద్రగడ గిరిబాబు పరామర్శ.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 30**:మండల కేంద్రమైన ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బత్తిన శేషారావు మాతృమూర్తి బత్తిన మహాలక్ష్మి ఇటీవల కాలంలో స్వర్గస్తులైనారు. ?సోమవారం మహాలక్ష్మి పెద్దకర్మ కావడంతో విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు వారి నివాసానికి వెళ్లి మహాలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం శేషారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రతిపాడు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడాల వెంకటరత్నం,మేడిపోయిన చంద్రశేఖర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం లో పేదలకు సొంతింటికళ -ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ





**అంబాజీపేట, పెన్ పవర్, మార్చి 30:**రాష్ట్ర ప్రభుత్వం పేదల గృహావసరాలను తీర్చేందుకు కట్టుబడి పనిచేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తోందని పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు గ్రామంలో మొత్తం 69 గృహాలు పూర్తి చేయబడ్డాయని ఈ పూర్తి అయిన గృహాలలో 3 గృహాలను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల గృహాలను ప్రారంభోత్సవం చేయడం జరిగింది. పి. గన్నవరం నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2024 నుండి 2026 వరకు మొత్తం 1367 గృహాలు పూర్తి చేయబడ్డాయని అన్నారు. పి.గన్నవరం నియోజకవర్గం లోని అయినవిల్లి -- 333, అంబాజీపేట -- 475, పి. గన్నవరం -- 385, మామిడికుదురు -- 174. నిర్మాణాలు జరిగాయని అన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకం కింద పి. గన్నవరం నియోజకవర్గంలో నూతన గృహాల కోసం 4957 మంది లబ్ధిదారులకు డిమాండ్ సర్వే నిర్వహించి అర్హులను గుర్తించడం జరిగింది. ఈ పథకం ఏప్రిల్ నెలలో మంజూరు అయ్యే అవకాశం ఉందని అన్నారు.

ఈ పథకానికి యూనిట్ విలువ రూ. 2.39 లక్షలుగా నిర్ణయించబడింది. దీనికి సంబంధించి జి.ఓ. నెం: 20, ఈనెల 16న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమానంతరం పేదలకు దాతలు సమకూర్చిన దుప్పట్లు, చీరలను ఎమ్మెల్యే పంపిణీ చేసారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పి. గన్నవరం నియోజకవర్గ కోకన్వీనర్

దాసరి వివి సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జల్లి బాలరాజు, ఎం.పి.పి దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎం.పి.టి.సి. పబ్బినీడి రాంబాబు, గూడాల ఫణి, రవణం రాము, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, నేదునూరి కళ్యాణ్,

కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల సంత, రోజువారీ మార్కెట్ వేలంపాటలు నిర్వహణ

**చింతూరు పెన్ పవర్ మార్చి 30:**చట్టి గ్రామపంచాయతీలో సర్పంచ్ రవ్వ భద్రమ్మ అధ్యక్షతన వారాంతపు పశువుల సంత (మేకల సంత) మరియు రోజువారీ మార్కెట్ ఆసిల్‌కు సంబంధించిన బహిరంగ వేలంపాటలు సోమవారం నిర్వహించారు. వారాంతపు పశువుల సంత వేలంపాటలో గ్రామపంచాయతీ నిర్ణయించిన ప్రారంభ ధర రూ.60 వేలుగా ఉండగా, వేలంలో పాల్గొన్న వారి పోటీలో సంవత్సరానికి మొత్తం రూ.84,700కు చట్టి గ్రామానికి చెందిన రవ్వ వీరేంద్ర దక్కించుకున్నారు. అలాగే, గ్రామపంచాయతీ పరిధిలో రోజువారీ వ్యాపార నిమిత్తం వచ్చే వాహనాలపై మార్కెట్ ఆసిల్ వసూలు హక్కుల కోసం నిర్వహించిన వేలంపాటలో ప్రారంభ ధర రూ.20 వేలుగా నిర్ణయించారు. ఈ వేలంలో తుర్రం నీలయ్య సంవత్సరానికి రూ.50 వేల రూపాయలకు హక్కులను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు డిప్యూటీ ఎంపీడీవో ఆర్. వీర్రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి షేక్ మహమ్మద్ అలీ, పెసా కమిటీ సభ్యులు తుర్రం చిన్న ముత్తయ్య, పొడియం రామకృష్ణతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పీ-4 మార్గదర్శి,రెడ్డి అమర్నాథ్ చౌదరికి ఎమ్మెల్యే సత్యప్రభ ఘన సన్మానం.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మార్చి 30:**ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు పీ-4 మార్గదర్శి,రెడ్డి అమర్నాథ్ చౌదరికి సోమవారం సాయంత్రం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ రాజా ఆధ్వర్యంలో అమర్నాథ్ చౌదరి సేవలను అభినందిస్తూ ఎమ్మెల్యే సత్యప్రభ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అమర్నాథ్ చౌదరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు స్థానిక ఎమ్మెల్యే సత్యప్రభ సహకారంతో పేదల అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారాలు అందించి పేదరిక నిర్మూలనకు తోడ్పడతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,టీడీపీ స్టేట్ యూత్ కార్యదర్శి లొండ లోవరాజు,పెద్దిపాలెం నాయకులు రీసు సత్తిబాబు,పుట్టా వీర్రాజు చౌదరి,కుండల అప్పారావు,లొండ వెంకటేష్,బాతు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



## ధోనీ లేకుండానే బరిలోకి చెన్నై..
## RR vs CSK మ్యాచ్ పిచ్ రిపోర్ట్, ప్లేయింగ్ XI ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టుతో గౌహతిలోని బర్సపరా స్టేడియంలో ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు చెన్నైకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ గాయంతో తొలి రెండు వారాలు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. దీంతో జట్టులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్‌పై ప్రత్యేక దృష్టి ఉంది. గతంలో రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు ఇప్పుడు సీఎస్కేలోకి మారి తొలి మ్యాచ్ ఆడనున్నాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్, శివం దూబేలు బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ లేకపోవడం జట్టుకు పెద్ద లోటు అని చెప్పాలి. ఇక బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

రాజస్థాన్ జట్టు విషయానికి వస్తే, వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఆరంభం ఇవ్వాలని చూస్తున్నారు. యశస్వి జైస్వాల్, ధ్రువ్ జురెల్, కెప్టెన్ రియాన్ పరాగ్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. జోఫ్రా ఆర్చర్, ఆడమ్ మిల్నే, రవీంద్ర జడేజా లాంటి బౌలర్లు జట్టుకు అదనపు బలం. గౌహతిలోని బర్సపరా స్టేడియంలోని పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కాదు.. ఇక్కడ బౌలర్లే ఎక్కువగా ఆధిపత్యం ప్రదర్శిస్తారు. మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు సుమారు 146 పరుగుల వరకు ఉంటుంది. పెద్ద స్కోర్లు చాలా అరుదుగా నమోదవుతాయి.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఈ రెండు జట్లు ఇప్పటివరకు 32 మ్యాచ్‌లు ఆడగా, చెన్నై 16, రాజస్థాన్ 16 మ్యాచ్‌లలో గెలిచి సమానంగా నిలిచాయి. దీంతో ఈ మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తుంది. మొత్తానికి ఇరు జట్లలో బలమైన ఆటగాళ్లు ఉండటంతో అభిమానులకు ఆసక్తికర పోరుని అందించే అవకాశం ఉంది.

**పిచ్ రిపోర్ట్:**
గౌహతిలోని బర్సపరా స్టేడియంలో పిచ్ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉంది. లక్ష్యాన్ని ఛేదించే జట్టు పైచేయి సాధించే ఛాన్స్ కనిపిస్తుంది. వికెట్‌పై కొంత గడ్డి ఉన్నప్పటికీ, అది కేవలం ఉపరితలాన్ని పట్టుగా ఉంచడానికే మాత్రమే.. మంచు ప్రభావం వలన వేగవంతమైన అవుట్‌ఫీల్డ్ స్పిన్నర్లకు సమస్యగా మారనుంది.

**RR vs CSK ప్లేయింగ్ XI:**
రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్మెయర్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దసున్ షనక, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, ఆడమ్ మిల్నే.

**ఇంపాక్ట్ ప్లేయర్ : అమన్ రావు**

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్, రాహుల్ చాహర్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్.
ఇంపాక్ట్ ప్లేయర్ : కార్తిక్ శర్మ

# రోహిత్ 2.0 రెడీ.. ప్రత్యర్థి జాగ్రత్తగా ఉండాల్సిందే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ని రోహిత్ శర్మ సూపర్ స్టార్ట్ చేశాడు. 200ం స్ట్రైక్ రేట్ తో హాఫ్ సెంచరీ చేసిన అతడిపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. కేవలం 38 బంతుల్లోనే 78 రన్స్ చేసిన ముంబై జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్ లోని మిగతా టీమ్స్ కి హెచ్చరించాడు. రోహిత్ 2.0 రెడీ అయింది.. ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ చేశాడు. కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూసిన తర్వాత ఒకటే చెబుదామని ఉందా అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపినట్లుగా అనిపిస్తోంది.. అత్యుత్తమ ఫామ్ లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేసేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని లాంటి బౌలింగ్ లో ఈజీగా సిక్సులు కొట్టేశాడు. స్వల్ప విరామం తర్వాత స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజుల సమయం పడుతుంది. కానీ, రోహిత్ పై ఆ ప్రభావం ఏమీ కనిపించలేదని కుంబ్లే వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం.. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయడం అందర్నీ షాక్ కి గురి చేసింది. రోహిత్-- ర్యాన్ -రికెల్టన్ దెబ్బకి పవర్ ప్లేలోనే అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం తీవ్ర నిరుత్సాహ పరిచింది. సునీల్ నరైన్ బౌలింగ్ కి వచ్చే సమయానికి జరగాల్సిన పూర్తి నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను పూర్తిగా దెబ్బ తీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా ఉపయోగించుకోవాలని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్‌కి బ్యాడ్‌న్యూస్.. ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసిన జియో




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ వేళ బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్ కి షాకిచ్చింది. భారత్ కి చెందిన జియోస్టార్ బంగ్లాలో ఐపీఎల్ ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐపీఎల్ ప్రసారాలపై గతంలో విధించిన నిషేధంపై పునరాలోచిస్తున్నట్లు అక్కడి సర్కార్ చెప్పిన తర్వాత ఈ పరిణామం జరగడం గమనార్హం. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని టీస్పోర్ట్స్ (బంగ్లాదేశ్ బ్రాడ్కాస్టర్)కు జియోస్టార్ రాసిన లేఖ ఆధారంగా ఇంటర్నేషనల్ మీడియా కథనాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం భాగస్వామ్య పక్షం గడువులోగా చెల్లింపులు చేయడంలో ప్రతిసారి ఫెయిల్ కావడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఉన్న సమయంలో హిందూ మైనార్టీలపై జరిగిన దాడులు జరిగాయి. అలాంటి సమయంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను మినీ వేలంలో కేకేఆర్ రూ. 9.20కోట్లకు సొంతం చేసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం బంగ్లాదేశ్ సర్కార్.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బంగ్లాలో కొత్తగా ఏర్పడిన సర్కార్ ఆ నిషేధంపై పునరాలోచిస్తామని సంకేతాలు ఇచ్చేసింది. ఇంతలోనే జియో డీల్ నుంచి బయటకు వచ్చేందుకు రెడీ అయింది. ఇందుకు భాగస్వాముల మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని సమాచారం. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ గా పేరుగాంచిన ఐపీఎల్ ను ఢాకా ఫ్యాన్స్ బాగా ఆదరిస్తారు. తాజా నిర్ణయం వ్యూయర్‌షిప్, ఫ్యాన్ ఎంగేజ్మెంట్ పై తీవ్ర ప్రభావం చూపించనుంది. కాగా, జియో నిర్ణయంతో ఐపీఎల్ ప్రసారాల కోసం 2027 వరకు టీస్పోర్ట్స్ కి ఉన్న పర్మిషన్స్ రద్దు అయ్యాయి.

# బైకర్ కోసం రోజుకి 32 కి.మీ.. శర్వా డెడికేషన్ కు హ్యాట్సాఫ్!

బైకర్ కోసం శర్వానంద్ చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాజాగా విడుదలైన ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ మార్పు వెనుక ఉన్న కఠినమైన ప్రయాణాన్ని స్పష్టంగా అందరికీ తెలిసేలా చేసింది. ఈ సినిమాలో బైకర్ పాత్రను రియలిస్టిక్‌గా చూపించాలన్న లక్ష్యంతో శర్వా పూర్తిగా తన శరీరాన్ని మలచుకున్నారు. ట్రైనింగ్ లో భాగంగా శర్వా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తడం లాంటి ఎక్స్‌ట్రీమ్ కార్డియో వర్కౌట్స్ చేయడమనేది మామూలు విషయం కాదు. క్రమశిక్షణతో చేసిన ఈ ప్రయాణంలో ఆయన 6 నుంచి 8 కిలోల వరకు బరువు తగ్గి, లీన్ మరియు యూత్‌ఫుల్ ఫిజిక్‌ను సాధించారు. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కేవలం లుక్ కోసమే కాకుండా, పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో జరిగిందిగా కనిపిస్తోంది. అయితే, ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం డెడికేషన్‌దే. కఠినమైన వర్కౌట్స్, నిరంతర శ్రమ, మానసిక ఒత్తిడి.. వీటన్నింటినీ ఎదుర్కొంటూ శర్వా తన టార్గెట్ ను సాధించారు. ఈ ప్రయాణాన్ని ఆయన స్వయంగా ఎగ్జాస్టింగ్, పెయిన్‌ఫుల్, రిలెంట్‌లెస్ గా అభివర్ణించడం, ఈ ప్రిపరేషన్ ఎంత తీవ్రంగా సాగిందో చెబుతోంది. ఫిజికల్‌గా మాత్రమే కాదు, మెంటల్‌గా కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒక పెద్ద ఛాలెంజ్‌గా నిలిచింది. ఫిట్‌నెస్ పరంగా చూస్తే, ఆయన రొటీన్ చాలా కఠినంగా ఉంది. జిమ్‌లో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటూ స్ట్రెచింగ్, బ్రీత్‌వర్క్‌లను కూడా పాటించారు. ముఖ్యంగా యోగా ఆయనకు మానసిక ప్రశాంతత ఇచ్చిన కీలక అంశంగా మారింది. కఠినమైన ట్రైనింగ్ వల్ల వచ్చే మెంటల్ స్ట్రెయిన్‌ను తగ్గించడంలో యోగా ముఖ్య పాత్ర పోషించిందని ఆయన చెప్పడం, ఫిట్‌నెస్‌లో మైండ్- బాడీ బ్యాలెన్స్ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. బిహైండ్ ది సీన్స్ యాంగిల్ లో చూస్తే, ఈ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రిపరేషన్ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోలో కనిపించిన ట్రైనింగ్ సెషన్స్, బైక్ రైడింగ్ ప్రాక్టీస్ ఇవన్నీ చూస్తుంటే శర్వా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారనేది తెలుస్తోంది. సినిమాలో ఉపయోగించే బైక్స్‌ను నడిపేందుకు స్పెషల్ గా ట్రైనింగ్ తీసుకోవడం ద్వారా, ఆయన పాత్రను మరింత సహజంగా తీర్చిదిద్దారు. ఇది కేవలం ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రమే కాకుండా ఒక యాక్టర్ కమిట్‌మెంట్ కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని శర్వా చూపించారు. కాగా బైకర్ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుండగా, ఇప్పటికే ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. మరి శర్వా ఈ సినిమా కోసం పడ్డ కష్టం ఏ మేరకు ఫలిస్తుందనేది చూడాలి.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది





జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com